క్లుప్తంగా

పోషకాహారం తీసుకోండి



సత్తుపల్లి: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి

సత్తుపల్లి/తల్లాడ/ఏన్కూరు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు, ఆకుకూరాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.మహాలక్ష్మి, హబీబున్నీసాబేగం, వెంకటమ్మలు తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని సత్తుపల్లి-5 అంగన్ వాడీ కేంద్రంలో, తల్లాడలోని బాలపేట గ్రామంలో, ఏన్కూరులోని గార్లొడ్డలో పోషణ మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ప్రతినెలా చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల లో బరువు చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహారావు, మహేష్, అంగన్‌వాడీ టీచర్లు రామ్ తున్నీసా, స్వాతి పాల్గొన్నారు.

సొంత గూటికి జెడ్పీటీసీ కవిత



కవితకు కండువా కప్పుతున్న మంత్రి హరీశ్‌రావు

ఎర్రుపాలెం: ఖమ్మంలో గురువారం జరిగిన వివిధ కార్యక్రమాలకు హాజరైన మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ సమక్షాన ఎర్రుపాలెం జెడ్పీటీసీ శీలం కవిత బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల ఆమె మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరగా, కొద్దిరోజులకే మళ్లీ బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మధిర మార్కెట్ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఎరువులు విక్రయించాలి

తల్లాడ: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులను విక్రయించాలని సత్తుపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు యు.నరసింహారావు అన్నారు. తల్లాడలో గురువారం పలు ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎరువుల దుకాణదారులు రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలన్నారు. డీలర్లు తప్పని సరిగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఏన్కూరు: విద్యార్థులు క్రీడలతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న మండలస్థాయి పాఠశాలల క్రీడాపోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తొలిరోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.5 లక్షలు ఇవ్వాలి

ఎర్రుపాలెం: నిరుపేదలకు అందించేదుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పతకానికి రూ.5 లక్షలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు తేలప్రోలు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యకర్తలు, వ్యవసాయ కార్మికులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వీరయ్య, నాయకులు జోగయ్య, బసవయ్య, సుబ్బారెడ్డి, పుల్లారావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సుదర్శన చక్రాన్ని ఆరాధించండి

సత్తుపల్లిటౌన్: శ్రీమన్నారాయణుడి దివ్య ఆయుధమైన సుదర్శన చక్రాన్ని ఆరాధించి పరిపూర్ణ ఫలితాలు పొందాలని హైద్రాబాద్ శ్రీసుదర్శన నారసింహ ఉపాసకులు నండూరి ఉదయ్ ఆచార్య ఉపదేశించారు. సత్తుపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. భగవత్ నామస్మరణ నిరంతరం చేయాలని సమాజహితం కోసం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నాగసీతారాం, రాయల గిరిబాబు, కొత్తూరు కార్తీక్, మాధవరావు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

తల్లాడ: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా ఖమ్మం జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అన్నారు. తల్లాడ, మల్లారం గ్రామాల్లో గురువారం జరిగిన ఐద్వా సమావేశాల్లో ఆమె ప్రసంగించారు. సమాజంలో సగభాగమైన మహిళలపై నిత్యం ఏదో ఒక చోట దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కార్యదర్శి ఫకీరమ్మ, సుక్కమ్మ, విజయ, రేణుక, నాగమ్మ, రుక్మిణమ్మ, లీలావతి, హేమలత, ఆమని పాల్గొన్నారు.

సమస్యల వలయంలో.. గురుకులం



ప్రమాదకరంగా ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్స్

- ప్రమాదకరంగా ఎన్నెస్పీ క్వార్టర్లు
- 250 మందికి ఆరే మరుగుదొడ్లు..
- క్యూలైన్ పాటిస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, పాలకులు

బోనకల్: మండల కేంద్రంలో గల మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల సమస్యలతో సతమతమౌతుంది. పాఠశాలలో 18 మరుగుదొడ్లు ఉండాల్సి ఉండగా 6 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని మరుగుదొడ్లకు డోర్లు కూడా లేవు. 250 మంది విద్యార్థులకు ఆరు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు క్యూలైన్ పాటించాల్సి రావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రమాదాలు జరుతున్నాయి.

సుమారు 50 ఏళ్ల నాటి ఎన్నెస్పీ భవనాలు పాఠశాల ఆవరణలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో చాలాకాలం వరకు విద్యార్థుల తరగతులు ఆ క్వార్టర్లలోనే నిర్వహించారు. ప్రభుత్వం కొత్తభవనాలను నిర్మించింది కానీ.. పూర్తిస్థాయిలో సరిపడకపోవడంతో ఎన్నెస్పీ భవనాలను కూడా ఉపయోగించాల్సి వస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు క్వార్టర్లు కూలిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు వాటిని తొలిగించడం లేదు.

విద్యార్థికి గాయాలు..

విద్యార్థుల స్నానానికి ఇటీవల నూతన ప్లాంట్‌ఫాం నిర్మిణం చేపట్టారు. ఈ క్రమంలో పాత ఎన్నెస్పీ క్వార్టర్లలో ఉన్న ఇటుకలను విద్యార్థులతో తెప్పించారు. గోడకూలి విద్యార్థి మట్టా అరవింద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను సందర్శించి శిథిలమైన క్వార్టర్స్‌ను తొలగించాలన్నారు.



వర్షానికి నీరుకారి చెమ్మదిగిన డైనింగ్‌హాల్

ప్రమాదభరితంగా..

నూతనంగా నిర్మించిన విద్యార్థుల డైనింగ్‌హాల్ లోపలిభాగం మరింత ప్రమాదభరితంగా తయారైంది. స్లాబ్ నుంచి వర్షపు నీరు పడుతుండడంతో గోడలకు చెమ్మ దిగి పాకురు పట్టాయి. విద్యార్థులు ఆ గోడలను తాకితే విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ భవనాన్ని ఇటీవలన నిర్మించినప్పటికీ నాసిరకంగా నిర్మించడంతో వర్షానికి కురుస్తుందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనికి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. విద్యార్థులు నిద్రపోవడానికి హాల్ లేకపోవడంతో డైనింగ్ హాల్‌ను ఉపయోగిస్తున్నారు. పలువురు విద్యార్థులు తమ పెట్టెలను తరగతి గదుల్లోనే పెట్టుకొని చదువుకుంటూ రాత్రి సమయంలో అక్కడే నిద్రపోతున్నారు. టాయిలెట్స్ పక్కనే మురుగు నీరు చేరి దుర్వాసనతో ఉండలేకపోతున్నారు. గురుకుల పాఠశాలకు విశాలమైన స్థలం ఉన్నప్పటికీ అందుకు అనువైన మౌళిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మరుగుదొడ్ల వద్ద నిలిచిన నీరు

వసతులు కల్పించాలి..



గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రమాదభరితంగా ఉన్న క్వార్టర్లను వెంటనే తొలిగించి, విద్యార్థులకు సరిపడ అదనపు గదులతో పాటుగా మరుగుదొడ్లను నిర్మించాలి.

– భూక్యా సైదానాయక్, సర్పంచ్, బోనకల్

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బోనకల్/తల్లాడ: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో బోనకల్, తల్లాడలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్లు పున్నం చందర్, రవికుమార్‌లకు వినతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించాలని డిమాండ్ చేశారు. లేని ఖెడల పెద్దెత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతలచెర్వు కోటేశ్వరావు, దొండపాటి నాగేశ్వరావు, కంకణాల సౌభాగ్యం, కిలారు సురేష్, తెల్లాకుల శ్రీను, పంతు, సునీత, శ్రీనివాసరావు, కొరివి, తాతా బాస్కర్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, ఫకీరమ్మ, ఎస్.మోహన్‌రావు, షేక్ మస్తాన్, పులి వెంకటనరసయ్య, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ: తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



బోనకల్: మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

బోనకల్/ఎర్రుపాలెం: తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య అన్నారు. గురువారం బోనకల్ స్థానిక సీపీఎం కార్యాలయంలో, ఎర్రుపాలెంలోని వెంకటాపురంలో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించి, అమరుల స్తూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు ముందుండి పోరాటాలు సాగించారన్నారు. వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కోటేశ్వరావు, నాగేశ్వరావు, బంధం శ్రీను, కోటేశ్వరరావు, రాములు, కాశేశ్వరరావు, జోగయ్య, నాగేశ్వరరావు, వెంకటనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడి బోయిన గోపాలరావును గురువారం సీపీఐ రాష్ట్ర నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు గోపాలరావును శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, రమేష్, పీవీరావు, రామాంజనేయులు, విష్ణుమూర్తి, భాస్కరరావు, శంకరరావు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పవిత్రోత్సవాలు

మధిరరూరల్: మధిర పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లపోతుల ప్రసాదరావు ఆధ్వర్యంలో భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

స్పోర్ట్స్ డ్రస్‌లు పంపిణీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రస్సులను అందించారు. గురువారం జోన్‌చైర్మన్ మందపాటి ప్రభాకర్‌రెడ్డి అందించిన ఆర్థిక సాయంతో.. విద్యార్థులకు డ్రస్సులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కృష్ణయ్య, రమేష్, శ్రీనివాసరావు, కృష్ణారావు, గోపాలరావు, దామోదర్‌రెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

చింతకాని: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎ.రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, పంచాయతీ, విద్యుత్ సంస్థల నుంచి అనుమతి ప్రతాలు పొందాలన్నారు. మైకు, మండపాలు, నిమజ్జనాలకు సంబందించిన సమాచారాన్ని పోలీసులకు తెలిపి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే కమిటీ సభ్యులపై చర్యలు తప్పవన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

ఏన్కూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయభాయి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొదండ రామాపురం తండలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ప్రహ్లాదరావు, సత్యనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలకై దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం



లయకు నగదు అందిస్తున్న సత్యనారాయణ

వైరా: వైరా పట్టణ వాస్తవ్యులు వేమూరి సత్యనారాయణ, స్వరూపరాణి దంపతుల కుమారుడు వేమూరి సుధీర్ (యూఎస్ఏ) వైరాకు చెందిన నిరుపేద బీటెక్ విద్యార్థిని కొమ్మూరి లయకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన లయ హైదరాబాద్‌లోని సీఎంఆర్ ఐటీ కళాశాలలో సీఎస్ఈలో సీటు సాధించింది. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మోహన్‌రావు, స్టేజీ పినపాక సర్పంచ్ పుల్లంరాజు, జీపీ కార్యదర్శి వంశీ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



సంజీవరెడ్డి(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన నరాల సంజీవరెడ్డి (63) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంజీవరెడ్డి సతీమణి అంగన్‌వాడీ టీచర్.. ఆమె విధులకు వెళ్లిన క్రమంలో సంజీవరెడ్డి ఒక్కరే ఇంట్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకరెడ్డి, నాయకులు డాక్టర్ కోటా రాంబాబు, స్థానిక సర్పంచ్ పద్మావతిలు సందర్శించి నివాళి అర్పించారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీ గ్రామానికి చెందిన సలీంద్ర వీరబాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరబాబు పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12న రాత్రి అదే గ్రామానికి చెందిన తోట గోపినాథ్‌తో గొడవ పెట్టుకుని బ్లేడుతో చెవిని కోశాడు. దీంతో గోపినాథ్‌ను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల డైరీలు పరిశీలన

మధిర: మధిర పట్టణంలోని సీపీఎస్ పాఠశాలలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ విద్యార్థుల డైరీలను పరిశీలించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నతి అనే విశిష్ట విద్యా కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా 10వ తరగతి విద్యార్థులచే దిన చర్యగా డైరీ రాయడం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం మొదలు చేసే విద్యా కార్యక్రమాలు, సందేహాలు, ప్రశ్నలు నమోదు చేసినట్లు చెప్పారు. ఉదయం ప్రత్యేక తరగతులను నిర్వహించడంతో పాటు ప్రతీ సోమవారం అన్ని సబ్జెక్టుల్లో ప్రత్యేక స్లిప్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పరీక్షల్లో కూడా ఉత్తమ ఫలితాలను సాధించాలనే ఉద్దేశంతో పాఠశాల సిబ్బంది కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



సందేహాలను నివృత్తి చేస్తున్న ప్రభుదయాళ్

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

ఖమ్మంలో బుధవారం రాత్రి జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా నిలిచిన గ్రామాలకు అవార్డు దక్కాయి. ఈ అవార్డులను పలు గ్రామాల సర్పంచ్‌లు కలెక్టర్ వీపీ గౌతమ్‌తో పాటుగా ఇతర అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన తల్లాడ పంచాయతీ సర్పంచ్ సంధ్యారాణి, ఈఓ ఉమను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్, జెడ్పీ సీఈఓ అప్పారావు



కల్లూరురూరల్: అవార్డు అందుకుంటున్న కొర్లగూడెం సర్పంచ్ బైరెడ్డి నర్సింహారెడ్డి



సత్తుపల్లిరూరల్: ఉత్తమ అవార్డు అందుకుంటున్న కాకర్లపల్లి సర్పంచ్ కంచర్ల రమాదేవి, కార్యదర్శి సీహెచ్.చైతన్య

సీడీపీఓ కార్యాలయం ముట్టడి

మధిర: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గురువారం ఐసీడీఎస్ మధిర ప్రాజెక్టు వద్ద వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఉద్యోగులు సీడీపీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ ఉద్యోగులు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న టౌన్ ఎస్సై రాజేష్ అక్కడికి చేరుకొని నిరసనకారులకు సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాం..

సత్తుపల్లిటౌన్: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం సత్తుపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు గురువారం ఆమె సంఘీభావం తెలిపారు. తమ ఆస్పత్రిలో వైద్యం కోసం ఉచిత హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాండు, శ్రీను, చంద్రశేఖర్, సర్వేశ్వరరావు, సీపీఐ నాయకులు రామకృష్ణ, యోబు, వెంకట్రావ్, సనందరావు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

సరుకులు అప్పగించాలి

కల్లూరురూరల్: సమస్యల సాధనకోసం గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. గురువారం కల్లూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సూపర్‌వైజర్లు వెళ్లి కేంద్రంలో ఉన్న సరుకులు తక్షణమే అప్పగించాలని నోటీసులు అందించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉన్నందున గత మూడు రోజులుగా బాలింతలకు, గర్భిణులకు, చిన్నపిల్లలకు పోషకాహారం అందటం లేదు. ఐసీడీఎస్ అధికారులు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తున్నారు. దానిలో భాగంగా తాళాలు వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించి, లబ్ధిదారులకు అవిముట్టినట్లు సంతకాలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పీడీ కృష్ణకుమారి, సూపర్ వైజర్లు విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి నోటీస్ అంటిస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

‘విజయభేరి’ని జయప్రదం చేయండి



కారేపల్లి: మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు రాందాస్ నాయక్

సత్తుపల్లి/కల్లూరురూరల్/కారేపల్లి: హైదరాబాద్‌లో ఈనెల 17న జరిగే కాంగ్రెస్ విజయభేరి బహిరంగసభను జయప్రదం చేయాలని మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్‌నాయక్, కొండూరు సుధాకర్ కోరారు. కల్లూరు మండలంలోని రామకృష్ణాపురంలో, కారేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, సత్తుపల్లిలో గురువారం జరిగిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు రాష్ట్ర ముఖ్యనేతలు పాల్గొంటారని తెలిపారు. సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, కొండూరి కిరణ్‌కుమార్, రఘుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు టోనీవీరప్రతాప్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, నాయకులు భీముడు, రాంబాబు, వినోద్, నారాయణ, తాజుద్దీన్, చాంద్‌పాషా, షేట్ రాం, బాబు, రామారావు, నవీన్, రాంకుమార్, శ్యామ్, చైతన్య, విజయ్, వంశీ, ప్రవీణ్, పవన్, లావుడ్యా భద్రు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



సత్తుపల్లిటౌన్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సత్తుపల్లిటౌన్/మధిర/ఎర్రుపాలెం: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మధిరలోని జీవీ అకాడమీ పాఠశాలలో, ఎర్రుపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావులు, పాఠశాల సూపరింటెండెంట్ కె.సరిత మాట్లాడుతూ..ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషలో హిందీభాష ఒకటని అన్నారు. విద్యార్థులకు హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ రాంబాబు, అధ్యాపకులు వినోద్‌కుమార్, కె.మధు, సారంగపాణి, బంగారి, పీర్‌సాహెబ్, శ్రీనివాస్, నవీన్, చెన్నారావు, మాధవి, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, రవికుమార్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, శ్రీకాంత్, ఇన్‌చార్జ్ రాజేశ్వరి, ఎండీ సుల్తానా, షేక్ హుస్సేన్ బీ, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



ఏన్కూరు: నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కారేపల్లి/ఏన్కూరు/ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిరాహార దీక్షని భగ్నం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. గురువారం కారేపల్లిలోని బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అదే విదంగా ఏన్కూరు, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కల్తి రాంప్రసాద్, బీజేపీ నాయకులు ధనసరి శ్రీనివాస్, తురక నారాయణ, కొండపల్లి ప్రదీప్, ఈసం భాస్కర్, తాళ్లూరి రాంబాబు, విజయ, చీమల శ్రీను, నల్లమోతుల రమేష్ రెంటపల్లి నారాయణ, మొరబోయిన కృష్ణ, వజనేపల్లి దర్గయ్య, నూతక్కి నర్సింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు, పిట్ల గోపాలరావు, కన్నా రామకృష్ణ, పసుపులేటి మల్లెల మోహన్‌రావు, జున్ను అశోక్, ప్రేమ్ కుమార్, ఈశ్వరయ్య ,అద్దంకి ఏసు గుడేటి బాబురావు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థపై కరువైన పర్యవేక్షణ..

ఏన్కూరు: మండలంలో విద్యావ్యవస్థపై విద్యాశాఖాధికారికి పర్యవేక్షణ కరువైందని సీపీఐ మండల కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఊరు – మన బడి పనులు నాసిరకంగా చేపడుతున్న పట్టించుకోవడం లేదని, ఏజెన్సీ అలవెన్స్‌లు పొందుతూ.. ఖమ్మం నుంచి రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. పలువురుపాధ్యాయు రియలెస్టేట్ వ్యాపారం చేస్తుండడంతోపాటు పాఠశాలలకు సమయపాలన పాటించడంలేదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.